


# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



**దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.**

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

# 14

### రస తరంగం - సరాగపరాగం

రసము అన్నమాటకి, అమృతము, ప్రేమ ఇలా చాలా అర్థాలున్నాయి. నేను ఈ పుస్తకం కోసం పాటలను తరంగాలుగా విభజన చేసినప్పుడు సరాగపరాగం, రసతరంగం అనే విభాగం చేశాను కానీ, వాటికి స్పష్టమైన గీటు అంటూ పెట్టటం అనేది కుదరని పని. ఈ సరాగ పరాగం అనే విభాగంలో డ్యుయెట్లను పెట్టడం జరిగింది. ఈ యుగళగీతాలు అనేవి చాలా కృతకంగా వుండే తప్పనిసరి అలంకారం సినిమాకి. ప్రేమికులు కానీ, భార్యా భర్తలు కానీ, తమకి ఒకరిపై ఒకరికి ఉన్న ఇష్టాన్నో, వాంఛనో, కామ ప్రకోపాన్నో వ్యక్తపరచుకోవలసిన తీరును, ఎలా వ్యక్తపరచాలి అనే బాధ్యతను, సినీ కవిగా నా నెత్తి మీద ఉంచినప్పుడు, ఇది వరకు వచ్చిన పాటలు గమనించి, మళ్ళా అలాగే వుండకుండా, ఒక కొత్తదనం కోసం, ఒక చమత్కారం కోసం వెంపర్లాడడమే తప్ప, ఈ పాటలలో ఒక ప్రత్యేకమైన ఆశయం కానీ, పరమార్థం కానీ వుండే అవకాశం లేదు. గుడ్డిలో మెల్ల అన్నట్టుగా వీటిలోని ప్రేమ అనే భావాన్ని తీసుకుని ఆ భావాన్ని గురించి విభిన్నమైన రీతుల్లో వ్యక్తపరిచే ప్రయత్నం చేశాను. ప్రేమ అనేది ఒక ఏబ్‌స్ట్రాక్ట్ విషయం. అది ఊహాత్మకమే కానీ వస్తుగతం కాదు.

ప్రేమ అనేది ఇద్దరు స్త్రీ పురుషుల మధ్య వుండే ప్రకృతి ప్రేరేపితమైన, హార్మోన్లవల్ల రెచ్చగొట్టబడ్డ దైహికమైన అభివ్యక్తి మాత్రమే కానక్కర్లేదు, అదొక భావుకమైన సంగతి, మానసికమైన విషయం అనే అభిప్రాయం కలవాణ్ణి నేను. ఈ అభిప్రాయానికి అనుగుణంగా అనేక పాటలు రాశాను.

ప్రేమను ఒక ఫిలసాఫికల్ స్థాయిలో డీల్ చేసి రాసిన ఒక పాట, నాకు బాగా నచ్చిన పాట "శ్రీకారమే ఇది". విరహంలో వున్న ప్రేయసీ ప్రియులకు ప్రేమ అనేది ఒక బలమైన భావన. ఈ భావనకు లోను కాని మనిషి ఎవరూ ఉండరు. ఎంత బలమైన కెరటంలా అది గుండెల్ని తాకుతుందో ఆ ప్రేమికులకే తెలుస్తుంది. జీవితంలో ఏదీ ఊరికే రాదు అని చెపుతూ, జీవితాన్ని, జీవితంలో ఉన్న విలువల్ని పోలుస్తూ, ఈ విరహం అనేది ఈ ప్రేమ పరీక్షలో నెగ్గటానికి ఒక పాఠ్యాంశంగా చిత్రీకరిస్తూ మొదలుపెట్టి, అనేకరకాలుగా ఈ ప్రేమను "ఏమిటో ఈ ప్రేమ" అని రంగేళి సినిమాలోనూ, "గుండెనిండా గుడిగంటలు" లాంటి పాటలలో వ్యక్తపరచడం జరిగింది. ఈ ప్రేమ తత్వాన్ని మృదువుగా చెప్పడానికి ప్రయత్నం చేసిన పాటలన్నిటిని ఈ రసతరంగంలో చేర్చాను. సరాగపరాగంలో ఇంతకు ముందు చెప్పినట్లుగా, ద్యుయెట్లను ఉంచాను. ప్రతీ సినిమాలోనూ ఈ ద్యుయెట్లు దాదాపు తొంభై శాతం వుంటాయి. అన్ని పాటలకంటే ఈ డ్యూయెట్ రాయటం ఎంతో కష్టం. సాధారణంగా, అవే మాటలు, అవే భావాలు రిపీట్ అవుతాయి. ఈ మధ్య బాణీలకు కూడా కొరత ఏర్పడి అవే బాణీలు కొంచెం రంగు మార్చుకుని వస్తున్నాయి. సంగీతం చిత్రీకరణ లాంటి ఆభరణాలను తీసేస్తే అనడానికి, వినడానికీ ఏమీ లేనటువంటి యుగళగీతాల్లో కూడా ఇసుకనుంచి తైలాన్ని పిండటానికి ప్రయత్నంలాగ ప్రయత్నం చేసాను. నిజానికి ఈ డ్యూయెట్ల విషయంలో ఎవరూ ఎవరి మీద కంప్లెయింట్ చెయ్యడానికి అవకాశం లేదు. ఇవి అలవాటు పడిపోయిన ఒక విధానం. ఇది ఇంతే. అందువలన వాళ్ళ మాకు అవకాశం ఇచ్చారు గాదు, అందుకనే రాయలేకపోయాం అని కంప్లెయింట్ చేసే అవకాశంలేదు. అయితే ఆత్మసంతృప్తి కోసం ఇందులో కూడా ఏదైనా ప్రయత్నం చెయ్యగలిగితే, మంచి వస్తువు ఇస్తే దర్శక నిర్మాతలు ఎప్పుడూ కాదనలేదు, కాదనరు.

సంగీతం సహాయం లేకుండా కేవలం చదువుకున్నా అర్ధవంతంగా కనబడే పాటలను నేను ఈ సరాగపరాగం అనే విభాగంలో చేర్చాను.

నా పాటలలోని సొగసులను, సోయగాలను నేనెంత అనందిస్తానో అంతే స్థాయిలో నా పాటలలో వుండే లోటుపాట్లు నాకు స్పష్టంగా తెలుస్తాయి. అందుకనే పెర్‌ఫెక్ట్ అనే పరిస్థితి వుందని నేను అనుకోవడం లేదు. ఒక వేళ వున్నా దానికి నేను చేరలేదు. కనుక, ఈ యుగళ గీతాల్లో చాలా భాగం పదాలు, భావాలు పునరావృతం అయినా అయి వుండవచ్చు.

**పల్లవి : శ్రీకారమే ఇదీ ప్రణయమా నీ కావ్యంలో**

**నీ గాథలో ప్రతీ క్షణం వర్థిల్లనీ, జ్వలించే గేయాలతో**

నీ పాట ఈదాలి కన్నీటి ఏటిలో

నీబాట వెలగాలి గాయాల కాంతిలో

అలల హోరె అక్షరాలై వలపుభాష నేర్చుకో

స్మృతుల నీడే నాకు తోడై తీపి చేదు తెలుసుకో

బాధ లేని ఏ బంధమైనా బిగువు లేనిది

పోరులేని ఏ విజయమైన విలువలేనిదీ

నీ శ్వాశ మరగాలి  గ్రీష్మాల సాక్షిగా

నా ఆశ నిలవాలి శిశిరాల కాంక్షగా

చితులు సైతం చిన్నబోయె చెలిమి చిచ్చు రేగనీ

ఋతువులన్నీ సమిధలయ్యే యాగదీప్తి సాగనీ

ఉరుములేని ఏ మేఘమైనా చినుకులేనిదే

మరిగిపోని ఏ లోహమైన పనికి రానిది

(యుగళగీతం చిత్రానికి బి.ఆర్. సురేష్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

పల్లవి: ఏమిటో ఏమో ఈ ప్రేమ - శాపమో వరమో ఈ ప్రేమ

నీతో ఆడుతుందీ ప్రేమ - నిను వేటాడుతుందీ ప్రేమ

విషమో అమృతమో చెప్పేవారే లేరమ్మా.. ||ఏమిటో||

ఏ నిముషం ఇది మొదలౌతుందో తెలియదు

గుండెల్లో చేరేముందు అనుమతి అడగదు

మనసుంటే ప్రేమించక మానదు

ప్రేమిస్తే మనకంటూ మనసే మిగలదు

అక్షరాలు రెండే అయిన లక్షలాది కథలను రాసే

ఈ ప్రేమలో పడి నిలబడతరమా ||ఏమిటో||

ప్రేమకు వేరే భాషొకటున్నది

జగమంటే నువ్వూ నేనే - అంతే అన్నది

కలిసేవరకు క్షణమొక యుగమని

కలిశాక యుగమే క్షణమనుకోమన్నది

లోకానికి అర్థం మార్చి, కాలానికి కొలతలు మార్చి

ఏదో గారడి చేసేస్తుంది

(రంగేళి చిత్రానికి ఎ.ఆర్.రెహమాన్ సంగీత సారథ్యంలో హరిహరన్, కవితాకృష్ణమూర్తి పాడినది)

అతడు: పంచమవేదం ప్రేమనాదం

గంగాసాగర సంగమ సంగీతం

శృంగార మంత్రాల మంగళ సంకేతం - ప్రేమనాదం

ఆమె: పంచమ వేదం ప్రేమనాదం

గంగాసాగర సంగమ సంగీతం

శృంగార మంత్రాల మంగళ సంకేతం - ప్రేమనాదం

అతడు : హృదయగగనమున తొలకరి కదలిక

ఆమె: బ్రతుకు పుటలలో పచ్చని గీతిక

అతడు : కళ్ళలోన విరివనాల పండగ

పల్లవించు పరిమళాల పండగ

ఆమె : పట్టలేని పరవశాలు చిందగ

పట్టపగలు పంచవర్ణ చంద్రిక

అతడు : అవనికి తెలిసిన ఆది కావ్యమిది

ఆమె : అవధులు తెలియని అమర గానమిది ||పంచమ||

ఆమె : మౌనమే శృతిగా మనసు పాడినది

అతడు : మోహమే జతిగా నాట్యమాడినది

ఆమే : తేలుతున్న రాగమాల మాధురి

తూలుతున్న రాసలీల లాహిరి

అతడు : మేలుకున్న మెరుపుకన్నె మాదిరి

మేని వన్నె మొలిక తిరిగె మరిమరి

ఆమె : అలజడి తలపుల మరులకాలమున

అతడు: అలసట తలవని అలల తాళమున ||పంచమ||

(పృధ్వీరాజ్ చిత్రానికి సత్యం సంగీత సారథ్యంలో బాలు పాడినది)

ఆమె: హృదయమనే కోవెల తలుపులు తెరిచే తాళం

ప్రేమా ప్రేమా - ప్రేమా ప్రేమా....

అతడు : ఆ.... త్యాగమనే దేవత సన్నిధి వెలిగే దీపం

ప్రేమా ప్రేమా - ప్రేమా ప్రేమా

ఆమె: అణువణువును చెలిమికి అంకితమిచ్చును ప్రేమ

అతడు: తను నిలువున కరుగుతు కాంతి పంచునది ప్రేమ

ఆమె : గగనానికి నేలకి వంతెన వేసిన వానవిల్లు ఈ ప్రేమ

ప్రేమా ప్రేమా - ప్రేమా ప్రేమా ||హృదయమనే||

ఆమె: ఇవ్వడమే నేర్పగల ఈ ప్రేమ తన కోరకు ఏ సిరిని అడగదు కదా

అతడు: నవ్వడమే చూపగల ఈ ప్రేమ - మంటలనే వెన్నెలగ మార్చును కదా

ఆమె: గాలికి, గంధము పూయడమే పూలకు తెలిసిన ప్రేమ కథ

అతడు: రాలిన పూవుల జ్ఞాపకమే కాలం చదివే ప్రేమ కథ

ఆమె: ప్రియమైన తనవారి సుఖశాంతులే కోరి మురిసేటి గుణమే ప్రేమా

ప్రేమా ప్రేమా - ప్రేమా ప్రేమా ||హృదయమనే||

ఆమె : ఏ జాతినో ఎందుకో విడదీసి వెంటాడి వేటాడు ఆటే ప్రేమా

అతడు: మౌనముతో మనసునే శ్రుతిచేసి రాగాలు పలికించు పాటే ప్రేమ

శాశ్వత చరితల ఈ ప్రేమ మృత్యువు ఎరగని చిరునామా

ఆమె : శ్వాసను మంగళహారతిగ వెలిగించేదీ ఈ ప్రేమా

మరణాన్ని ఎదిరించి మరుజన్మగా వచ్చి కరుణించు వరమే ప్రేమా

ప్రేమా ప్రేమా - ప్రేమా ప్రేమా ||హృదయమనే||

(పెళ్ళి సందడి చిత్రంలో కీరవాణి సంగీత సారధ్యంలో బాలు చిత్ర పాడినది)

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS